అందని భగీరథ నీరు

- మిర్యాలగూడ పట్టణంలో పూర్తిస్థాయిలో సరఫరా కాని నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


మిర్యాలగూడ పట్టణంలోని మిషన్ భగీరథ ట్యాంకు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీ ప్రజలకు భగీరథ నీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో 20 మిలియన్ లీటర్స్ పర్ డే (ఎంఎల్‌డీ) అవసరం ఉంటుంది. ప్రస్తుతం త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణానికి 10 ఎంఎల్‌డీ నీరు వస్తుంది. మిర్యాలగూడ మండలం కాలువపల్లి గుట్ట నుంచి పట్టణానికి మరో 10 ఎంఎల్‌డీ నీరు రావాల్సి ఉంది. అయితే ఈ రెండు ప్రాంతాల నుంచి వచ్చే 20 ఎంఎల్‌డీ నీరు పూర్తి స్థాయిలో సరఫరా అయితే పట్టణ ప్రజలకు నీటి సమస్య ఉండదు. కానీ కాలువపల్లి గుట్టపై నుంచి వచ్చే భగీరథ నీరు 10 మిలియన్ లీటర్స్ పర్ డే (ఎంఎల్‌డీ) సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 3, 4 ఎంఎల్‌డీలు మాత్రమే వస్తున్నాయి. దీంతో నీటి సమస్య ఎదురవుతోంది. పట్టణంలో 48 వార్డులు ఉండగా సుమారు 26 వేలకు పైగా గృహాలున్నాయి. పట్టణంలో మొత్తం 17,250 నల్లా కనెక్షన్లు ఉండగా 5,400 కనెక్షన్ల ద్వారా మాత్రమే మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం మిషన్ భగీరథ పథకం కింద కొన్ని ఇళ్లకు పైపులైన్లు వేసినప్పటికీ వాటికి నేటికీ సరఫరా కావడం లేదు. ఇదిలా ఉండగా.. కొంతమంది ప్రజలు తమ ఇళ్లల్లో హౌజ్‌లు నిండిన తరువాత ట్యాప్ ఆఫ్ చేయకుండా కాలువల్లోకి వదులుతుండడంతో నీరు వృథాగా పోతోంది. అయితే వేసవి కావడంతో మున్సిపాలిటీ అధికారులు ప్రణాళిక ప్రకారం నీటి ఎద్దడిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చివరి ప్రాంతాలకు రావడం లేదు



మున్సిపాలిటీలోని చివరి ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదు. గతంతో సెంటర్‌లో మంచినీటి పబ్లిక్ నల్లా ఉండేది. దానిని తొలగించారు. అదే విధంగా అపార్ట్‌మెంట్లలోకి కూడా నీరు సరఫరా కావడం లేదు. వేసవి ప్రారంభమైనందున నీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి.

– వెంకట్‌రెడ్డి, కృష్ణాకాలనీ, మిర్యాలగూడ

చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటీలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటాం. కాలువలపల్లి గుట్ట నుంచి పట్టణానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీళ్లు అడపాదడప వస్తుండడంతో మంచి నీటి సమస్య తలెత్తుతోంది. పెద్దదేవులపల్లి రిజర్వేయర్‌తో పాటు కాలువపల్లి గుట్ట నుంచి వస్తున్న మిషన్ భగీరథ నీరు పూర్తి స్థాయిలో సరఫరా అయితే నీటి సమస్య చాలా వరకు పరిష్కారమవుతుంది. ఈ విషయం మరోసారి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, పూర్తి స్థాయిలో నీరు వచ్చే విధంగా కృషి చేస్తా.

– తిరునగరు భార్గవ్, మున్సిపల్ చైర్మన్, మిర్యాలగూడ

క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయి


చెస్ పోటీలు ప్రారంభిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్: క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు, దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మిర్యాలగూడ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ భవనంలో మహిళా న్యాయవాదులు, కోర్టు మహిళా సిబ్బందికి నిర్వహించిన వివిధ క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, గేమ్స్ కార్యదర్శి కొంక వెంకన్న, సీనియర్ న్యాయవాది తడకమళ్ల రాంరంగారావు, బహునూతల వేణుగోపాల్‌రావు, మహిళా న్యాయవాదులు మాధవరం జ్యోతి, మౌనిక, ఉమాదేవి, సుష్మిత, ఫర్వీన్ తదితరులున్నారు.

గిరిజనులకు ఎంపీ టికెట్ కేటాయించాలి

మిర్యాలగూడ: బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ ఎంపీ స్థానాన్ని గిరిజనులకు కేటాయించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధనావత్ ప్రకాశ్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వీరానాయక్, సచిన్, దస్రునాయక్, నాగునాయక్, చిట్టిబాబు, అమ్రునాయక్, రాంసింగ్‌నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

బుడిగ జంగాల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

వేములపల్లి: రాష్ట్రంలో బుడిగ జంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బుడిగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిడుగొండ రామచంద్రు కోరారు. బుధవారం వేములపల్లిలో ఆయన మాట్లాడారు. బుడిగ జంగాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, మూడెకరాల భూపంపిణీ చేపట్టాలని, రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

శ్రీనివాస్‌గౌడ్‌కు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ: దేవరకొండ మండల పరిధిలోని కొమ్మేపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ న్యూఢిల్లీలోని ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రదానం చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో తన కృషిని గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు

మిర్యాలగూడ: దామరచర్ల మండలం దిలావర్‌పూర్‌లో ప్రజలు విషజ్వరాల బారిన పడుతుండడంతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశానుసారం బుధవారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా దామరచర్ల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు నాగేశ్వర్‌రావు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం సాయి, కృష్ణవేణి, అంజమ్మ, సరిత, శారద, జానమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపేటలో..

హాలియా: మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో 2వ వార్డు కౌన్సిలర్ యడవెల్లి అనుపమ నేతృత్వంలో బుధవారం హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొదటి వార్డు కౌన్సిలర్ వెంకటయ్య, హెల్త్ అసిస్టెంట్ సైదులు, దయాసాగర్, లక్పతి, జావేద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

దేవరకొండ: దేవరకొండ మండల పరిధిలోని రాష్ట్ర గిరిజన గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 2024– 25 ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్యామల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 12 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 18న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వన్‌టౌన్ సీఐగా బాధ్యతల స్వీకరణ

మిర్యాలగూడ అర్బన్: వన్‌టౌన్ సీఐగా సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత నెల క్రితం ఇక్కడకు బదిలీపై వచ్చిన పీఎన్‌డీ ప్రసాద్ తిరిగి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా పని చేస్తున్న సుధాకర్ ఇక్కడకు వచ్చారు.

నిధులు కేటాయించాలి

వేములపల్లి: మండలంలోని బుగ్గబావిగూడెం గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, ఎంపీటీసీ చల్లబొట్ల చైతన్య కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని బుధవారం మిర్యాలగూడలో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఏర్పాట్ల పరిశీలన

అడవిదేవులపల్లి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా అడవిదేవులపల్లి మండల కేంద్రం సమీపంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న బౌద్ధమ దేవాలయాల్లో ఈనెల 8న నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం ఎస్ఐ హరిబాబు, ఎంపీడీఓ కరుణాకర్ రావు పరిశీలించారు. వారి వెంట ఎంపీఓ మోషిన్‌బిన్ అహ్మద్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం


సీతారాం (ఫైల్)

హాలియా: ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుముల స్టేజీ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. తిరుమలగిరి(సాగర్) మండలంలోని శ్రీరాంపల్లితండాకు చెందిన కేతావత్ సీతారాం(45) తన బైక్‌పై పెద్దవూర మండలానికి కూలీ పనుల కోసం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అనుముల స్టేజీ వద్ద ట్రాక్టర్‌ను బైక్‌పై వస్తున్న సీతారాం వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడకు చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. కాగా.. సీతారాం మృతి విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రె పొట్టేళ్లు మృతి

గుర్రంపోడు : మండలంలోని సుల్తాన్‌పురం గ్రామంలో మంగళవారం రాత్రి మృగశిర సత్యనారాయణ ఇంటి ఆవరణలోని దొడ్డిలోకి కుక్కలు చొరబడి దాడి చేయడంతో 20పొట్టేళ్లు మృతిచెందాయి. మరో 20 గొర్రె పొట్టేళ్లు దాడిలో గాయపడ్డాయి. నాలుగు లక్షల మేరకు నష్టం జరిగిందని రైతు తెలిపాడు. సంఘటన స్థలాన్ని మండల పశువైద్యాధికారి అశోక్ పరిశీలించారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: వేసవిని దృష్టిలో ఉంచుకొని దేవరకొండ మండల పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సంబంధిత ఇరిగేషన్ అధికారులకు సూచించారు. బుధవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలన్నారు. అనంతరం ఆయా శాఖల ప్రగతి నివేదికలపై సమీక్షించారు. ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఎల్‌పీఓ మోహన్‌రావు, ఎంపీడీఓ జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంచి సంకల్పమే మానసిక ప్రశాంతత

మిర్యాలగూడ: మంచి సంకల్పంతో ఉండడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో /జ్ఞాన సూర్యభవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య ప్రదర్శనను రాజయోగిని బీకే శకుంతలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి కుటుంబాన్ని, సమాజాన్ని మంచి మార్గంలో నడిచే విధంగా తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈనెల 9వరకు జ్యోతిర్లింగాల ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, శివాలయం చైర్మన్ బండారు కుశలయ్య, నాయకులు వెంకటరమణచౌదరి, సంతోష్, చిల్లంచర్ల శ్రీనివాస్, బ్రహ్మకుమారి స్పందన, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీ, వినోద్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

‘రైతు నేస్తం’ ఎంతో మేలు

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


మిర్యాలగూడలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు

మిర్యాలగూడ: రాష్ట ప్రభుత్వం చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమంతో రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రైతు నేస్తంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి చేసిన ప్రసంగాన్ని బుధవారం మిర్యాలగూడ రైతు వేదికలో రైతులకు వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు నేస్తం ద్వారా రైతులు నేరుగా శాస్త్రవేత్తలతో చర్చించి ఎప్పటికప్పుడు వారి సలహాలు, సూచనలు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు పోరెడ్డి నాగమణి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు, ఎంపీటీసీలు, సీఈఓలు, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ అందించాలి


బాలునాయక్, రఘువీర్‌రెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

దేవరకొండ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీని అందించాలని, అందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ యువజన కాంగ్రెస్ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అనంతరం పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. అభ్యర్థి ఎవరైనా యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభ్యర్థి గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్, ఎన్నికల పరిశీలకులు అరుణ్‌మీర్జా, జిల్లా అధ్యక్షుడు రాజా రమేష్‌యాదవ్, నాయకులు జాల నరసింహారెడ్డి, ఎంఏ సిరాజ్‌ఖాన్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, ఆలంపల్లి నర్సింహ, పున్న వెంకటేశ్వర్లు, బిక్కు నాయక్, దేవేందర్, జర్పుల లక్ష్మి, కొర్ర గౌతమి, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

త్రిపురారం: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా బుధవారం త్రిపురారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సీఎం సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతులకు వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి పార్వతి చౌహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాగర్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి హౌజింగ్ పీడీ రాజ్ కుమార్, డీడీపీ హుస్సేన్ బాబు, ఎంపీపీ అనుముల పాండమ్మ, జెడ్పీటీసీ ధనావత్ భారతి, ఇన్‌చార్జ్ ఏడీఓ సందీప్ రెడ్డి, అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చి రెడ్డి, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, ఎంపీటీసీలు, ఏఈఓలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు


ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిర్యాలగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి ఆరోపించారు. బుధవారం మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వమే ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలన్నారు. సాగర్ ఎడమకాల్వకు నీటిని అందించి సాగు, తాగునీటి ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 58, 59ను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించి పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మోసిన్‌అలీ, ఎంపీపీలు నూకల సరళహన్మంతరెడ్డి, ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, నాయకులు పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, పెండ్యాల పద్మ, కోదాటి రమా, పెరుమాళ్ల తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

హాలియా: ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలు నిర్ణయానికి నిరసనగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం హాలియా పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. పార్టీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పట్టణ, వార్డు కమిటీ ఇన్‌చార్జ్‌లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొలువుల సాధనలో ‘స్వాతి’ముత్యం

- ఏకకాలంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు
- సత్తా చాటిన నేనావత్ స్వాతి


నేనావత్ స్వాతి

మహేశ్వరం: ఆశయ సాధన ముందు ఆర్థిక ఇబ్బందులు తలొగ్గాయి.. పట్టుదలను నమ్ముకుని ఇష్టంగా చదివి.. ఏక కాలంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది మహేశ్వరం మండలం కావలోనిబాయితండాకు చెందిన నేనావత్ స్వాతి. నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్ నేరడిగొమ్ము మండలం పడమటితండాకు చెందిన జీజాబాయి– లక్ష్మణ్‌నాయక్‌ల కుమార్తె స్వాతి. ఈమెకు 2017లో కావలోనిబాయి తండాకు చెందిన గణేశ్‌నాయక్‌తో వివాహమైంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకున్న స్వాతి భర్త గణేశ్ ప్రోత్సాహంతో, కుటుంబ బాధ్యతలు మోస్తూనే ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమైంది. ఇటీవల విడుదలైన పోటీ పరీక్షల ఫలితాల్లో మూడు ఉద్యోగాలు (జూనియర్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలిగా, పీజీటీ– ఫిజికల్ సైన్స్, టీజీటీ– ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిగా) సాధించింది. స్వాతి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భర్త గణేశ్ నాయక్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులు, భర్త సహకారంతో తాను మూడు ఉద్యోగాలు సాధించానని స్వాతి తెలిపింది.

అందరున్నా.. అనాథగా మారిన తండ్రి


భిక్షానాయక్

మిర్యాలగూడ టౌన్: తనకున్న భూమిని పిల్లల పేరుపై బదిలీ చేశాడు. నేడు వారు ఆదరించకపోగా రోడ్డున పడేశారు. దీంతో అందరు ఉన్నా అనాథగా మారాడు ఆ తండ్రి.. తిరుమలగిరి మండలం ఎర్రచెరువు తండాకు చెందిన రమావత్ భిక్షానాయక్(75)కు ఏడుగురు సంతానం. వీరిలో ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. తనకు ఉన్న 20 ఎకరాల వ్యవసాయ భూమిని ముగ్గురు కుమారులైన బాలాజీ, ముని, రాములు పేరు మీద ఆరు ఎకరాల చొప్పున 18 ఎకరాలను పంచి, తనకు రెండు ఎకరాలు ఉంచుకున్నాడు. ప్రస్తుతం తన రెండెకరాల భూమిని కూడా తన పిల్లలే చేస్తున్నారని, కానీ తన పోషణ పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఈ విషయంపై తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేశానని భిక్షానాయక్ తెలిపాడు. ఇటీవల అతని భార్య లక్కి కూడా మృతి చెందిందని పేర్కొన్నాడు. తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అని తన కుమారులు ఇంటి నుంచి గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై స్థానిక ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం కార్యాలయానికి రాగా.. ఆర్డీఓ లేకపోవడంతో వెనుతిరిగాడు. అందరూ ఉన్నా అనాథగా మారానని బస్టాండ్ వద్ద భిక్షానాయక్ కన్నీటి పర్యంతం కావడం అందరినీ కలిచివేసింది.

కొత్త నందికొండలో వైద్యశిబిరం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్


జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అడవిదేవులపల్లి: మండలంలోని కొత్త నందికొండ గ్రామంలో బుధవారం వైద్య బృందం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. బుధవారం ‘సాక్షి’ దినపత్రికలో ‘కొత్త నందికొండలో విషజ్వరాలు’ అనే శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు గ్రామాన్ని సందర్శించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఉపేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామంలోని జ్వర పీడితులైన 31 మందికి పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా ఎంపీడీఓ కరుణాకర్‌రావు , ఎంపీఓ మోషన్‌బిన్ అహ్మద్ గ్రామాన్ని సందర్శించి, పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. మంచినీటి ట్యాంకు క్లోరినేషన్ చేయించి పరిసరాలను పరిశుభ్రం చేయించారు. అనంతరం గ్రామ కార్యదర్శి శారద, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ బాలునాయక్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేయాలి


ధర్నాలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

దేవరకొండ: ఎలాంటి చార్జీలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్‌ఎస్‌ను అమలు చేయాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లక్షల మంది దరఖాస్తుదారులపై రూ.వేల కోట్ల భారాన్ని మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నేడు దరఖాస్తుదారులపై భారం మోపుతుందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కేతావత్ బీల్యానాయక్, కంకణాల వెంకట్‌రెడ్డి, వంగాల ప్రతాప్‌రెడ్డి, గాజుల ఆంజనేయులు, వల్లపు రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, దస్రునాయక్, చింతపల్లి సుభాష్, కేసాని లింగారెడ్డి తదితరులున్నారు.

మహిళా శక్తిని చాటేందుకే శక్తివందన్ బిల్లు


మిర్యాలగూడ టౌన్: మాట్లాడుతున్న సరిత

మిర్యాలగూడ టౌన్: మహిళలను శక్తివంతం చేసేందుకే శక్తివందన్ బిలు అని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత అన్నారు. శక్తి వందన్ కార్యక్రమంలో భాగంగా నరేంద్రమోదీ ప్రసంగాన్ని బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఖమ్మం రోడ్డులో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ భాణావత్ రతన్‌సింగ్‌నాయక్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డి, కొండేటి శేఖర్, ఉప్పల లక్ష్మారెడ్డి, రామకృష్ణారెడ్డి, యాదమ్మ, పందిరి భాగ్యమ్మ, భద్రమ్మ, అమల, నాగమణి పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

పెద్దవూర: మహిళల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంకణాల నివేదితారెడ్డి అన్నారు. శక్తి వందన్ బిల్లుపై ప్రధాని మోదీ ప్రసంగాన్ని బుధవారం పెద్దవూర మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో స్క్రీన్ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ చట్టం అమల్లోకి రాగానే పార్లమెంట్, అసెంబ్లీలో రాజకీయంగా మహిళలకు 33శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏరుకొండ నర్సింహ, మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్లు మేకల స్వాతి, పద్మ, శిరీష, కత్తి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా కండక్టర్లు, ప్రయాణికులకు సన్మానం

మిర్యాలగూడ టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపో ఆవరణలో 52 మంది మహిళా కండక్టర్లు, వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా ప్రయాణికులను ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ సత్కరించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ పుప్పాల యాదగిరి, సీనియర్ అసిస్టెంట్ అకౌంటెంట్ శ్రీనివాస్, మహిళా కండక్టర్లు విజయలక్ష్మి, రమణ, పుష్ప, సైదమ్మ, లక్ష్మి, సెక్యూరిటీ గార్డు జయలక్ష్మి తదితరులున్నారు.


మహిళలను సన్మానిస్తున్న డీఎం బొల్లెద్దు పాల్

లింగవివక్షకు తావులేకుండా చూడాలి


పెద్దవూర: మహిళలను సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

పెద్దవూర: సమాజంలో లింగవివక్షకు తావులేకుండా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎంపీపీ చెన్ను అనురాధ అన్నారు. మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం పెద్దవూర మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి, ఏసీడీపీఓ సువర్ణ, సూపర్‌వైజర్ కమలాబాయి, పార్వతి, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తల్లిదండ్రులు మగ పిల్లలతో పాటు ఆడపిల్లలను కూడా సమానంగా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. బుధవారం ఎల్లాపురంతండా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో నీలావతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు మద్దతు

మిర్యాలగూడ టౌన్: చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేంద్ర గౌడ్ చేపట్టిన మహాపాదయాత్ర బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ అమరువీరుల స్థూపం వద్ద ముగిసింది. మిర్యాలగూడకు చెందిన బీసీ సంక్షేమ సంఘం నేతలు ఆయనకు మద్దతు పలికి సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సైదులు, మట్టరాజ్ యాదవ్, శివరామకృష్ణ, సతీష్, కరుణాకర్, సతీష్ తదితరులున్నారు.

నల్లగొండ పార్లమెంట్ సీటును బీసీలకు కేటాయించాలి


మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్: వచ్చే ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ సీటును అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు కేటాయించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ సంఘం కార్యాలయంలో నిర్వహించిన యువజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలను అన్ని రాజకీయ పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు అధిక సీట్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో 8 స్థానాలను బీసీలకు ఇవ్వాలన్నారు. ఏ రాజకీయ పార్టీ బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందో.. అదే పార్టీకి వచ్చే ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు ఆర్. శ్రీనివాస్, రాయించు నర్సింహ, చిలకల మురళీయాదవ్, పగిళ్ల అనిల్‌కుమార్, నరేష్, గంగాధర్ పాల్గొన్నారు.